# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను
వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక
http://vaasthavanestham.com
సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
• జిల్లా బ్యూరో చీఫ్‌లు
• జిల్లా స్టాఫ్ రిపోర్టలు
• నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
• మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 329 మంగళవారం 6 ఆగస్టు 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri




# స్థానికతపై ప్రతిపాదనలు...

- జీవో 317 పై ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ వరుస సమావేశాలు
- 317 జీవో పై స్థానికతకు సంబంధించి రెండు రకాల ప్రతిపాదనలను సాధారణ పరిపాలన శాఖ క్యాబినెట్ సబ్ కమిటీ ముందు ప్రతిపాదించింది.
- అయితే సాధారణ పరిపాలన శాఖ ప్రతిపాదించిన అంశాలపై ఆ శాఖ ముఖ్య కార్యదర్శి రాష్ట్ర అడ్వకేట్ జనరల్ తో సంప్రదించాలని సూచించింది.

## హైదరాబాద్‌లో కాగ్నిజెంట్
# కొత్త సెంటర్



- రేవంత్ రెడ్డి సమక్షంలో కుదిరిన ఒప్పందం
- అమెరికాలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబులతో కాగ్నిజెంట్ సీఈవో భేటీ
- దాదాపు 15 వేల మందికి ఉద్యోగాలు కల్పించేలా కొత్త సెంటర్
- కాగ్నిజెంట్‌కు అన్ని విధాలా సహకారం ఉంటుందని ముఖ్యమంత్రి హామీ


**అమెరికా**

తెలంగాణలో భారీ విస్తరణకు ప్రముఖ ఐటీ దిగ్గజం కాగ్నిజెంట్ ముందుకు వచ్చింది. దాదాపు 15 వేల మందికి ఉద్యోగాలు కల్పించేలా 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హైదరాబాద్‌లో కొత్త సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. అమెరికాలో ఉన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతో కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్, కంపెనీ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఒప్పందం - మిగతా 3లో



## కేజ్రీవాల్‌కి దక్కని ఊరట

- బెయిల్ పిటిషన్‌ని కొట్టేసిన ఢిల్లీ హైకోర్టు
- ఈ ఘటనను చట్టవిరుద్ధమైన అరెస్టు అని చెప్పలేం
- బెయిల్ దరఖాస్తు కోసం కేజ్రీవాల్ ట్రయల్ కోర్టును ఆశ్రయించే స్వేచ్ఛ ఉందని ఢిల్లీ హైకోర్టు స్పష్టం



## వయనాడ్ విషాదానికి కారణమదే..

- కేంద్ర మంత్రి సంచలన వ్యాఖ్య
- వయనాడ్‌లో అక్రమ గనుల తవ్వకాలు, జనవాసాల వల్లే అపార ప్రాణనష్టం జరిగింది
- అక్రమ జనావాసాలకు స్థానిక రాజకీయవేత్తల రక్షణ ఉంది
- కనీసం టూరిజం పేరుతో సరైన జోన్లను కూడా వాళ్లు ఏర్పాటు చేయలేదు



## బంగ్లాదేశ్ ఎయిర్‌క్రాఫ్ట్ కలకలం

- భారత గగనతలంలోకి ఆ దేశ ఎయిర్‌క్రాఫ్ట్
- వెంటనే గాల్లోకి ఎయిర్‌ఫోర్స్ యుద్ధ విమానం..!
- అప్రమత్తమైన ఇండియన్ ఎయిర్‌ఫోర్స్
- భారత్ - బంగ్లా సరిహద్దుల్లో హైఅలర్ట్
- అదనపు బలగాలను మోహరిస్తున్న బీఎస్ఎఫ్

# రైతులకు కొత్త రుణాలు



- భట్టివిక్రమార్క కీలక ఆదేశాలు
- బ్యాంకింగ్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం నుంచి పెద్ద మొత్తంలో రికవరీ జరిగింది
- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ కింద లక్షన్నర వరకు ఉన్న బకాయిలను ప్రభుత్వం జమ చేసింది
- ఇప్పటికే రూ.13 వేల కోట్ల నిధులను రైతు రుణమాఫీ కింద విడుదల చేశాం
- రైతులను రుణ విముక్తులను చేసి వెంటనే కొత్త రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను ఆదేశాలు

**ఖమ్మం**

రైతు రుణమాఫీ మూలంగా బ్యాంకర్లకు ఎక్కువ ప్రయోజనం చేకూరిందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. సోమవారం నాడు మధిరలో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ... రైతులకు వెంటనే రుణాలు ఇవ్వాలని సూచించారు. బ్యాంకింగ్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం నుంచి పెద్ద మొత్తంలో రికవరీ జరిగిందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ కింద లక్షన్నర వరకు ఉన్న బకాయిలను ప్రభుత్వం జమ చేసిందని మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇప్పటికే రూ.13 వేల కోట్ల నిధులను రైతు రుణమాఫీ కింద విడుదల చేశామని అన్నారు .రైతులను రుణ విముక్తులను చేసి వెంటనే కొత్త రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను ఆదేశించారు. సహకార - మిగతా 3లో



## నా రాజీనామా అడిగే నైతిక హక్కు యెడ్యూరప్పకు లేదు

- 'యెడ్యూరప్పపై పోక్సో కేసు ఉంది
- ఆయనపై ఎన్ని కేసులు ఉన్నాయో మీకు తెలుసా..?
- ఆయనపై చార్జిషీట్ దాఖలైంది
- కోర్టు బెయిల్ ఇచ్చింది కాబట్టి బయట ఉన్నారు
- సీఎం సిద్ధరామయ్య

# మాజీ సీఎం కేసీఆర్ బిగ్‌షాక్



- మాజీ సీఎం కేసీఆర్‌కు భూపాలపల్లి కోర్టు నోటీసులు
- సెప్టెంబర్ 5న మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులు వ్యక్తిగతంగా హాజరు కావాలని కోర్టు ఆదేశం
- మరో ఆరుగురికి కూడా నోటీసులు జారీ
- డిజైన్లు మార్చడం, నాణ్యత లోపాల కారణంగానే మేడిగడ్డ ప్రాజెక్టు కుంగుబాటుకు గురైందంటూ పిటిషన్‌లో రాజలింగం మూర్తి ఆరోపణ

**భూపాలపల్లి:**

మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కే.చంద్రశేఖర్ రావుకి బిగ్ షాక్ తగిలింది. డిజైన్ల మార్పు, నాణ్యత లోపాలే మేడిగడ్డ కుంగుబాటుకు కారణమంటూ ఆరోపిస్తూ దాఖలైన ఓ పిటిషన్‌పై విచారణలో కేసీఆర్‌కు భూపాలపల్లి కోర్టు నోటీసులు జారీ చేసింది. సెప్టెంబర్ 5న మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులు వ్యక్తిగతంగా హాజరు కావాలని కోర్టు ఆదేశించింది. మరో ఆరుగురికి కూడా నోటీసులు జారీ చేసింది. కాగా మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యంపై రాజలింగంమూర్తి అనే సామాజిక కార్యకర్త ఈ పిటిషన్ దాఖలు చేశారు. డిజైన్లు మార్చడం, నాణ్యత లోపాల కారణంగానే మేడిగడ్డ ప్రాజెక్టు కుంగుబాటుకు గురైందంటూ పిటిషన్‌లో రాజలింగం మూర్తి ఆరోపించారు. కాగా కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో మేడిగడ్డ వద్ద నిర్మించిన లక్ష్మీ బ్యారేజీ అంతర్ రాష్ట్ర వంతెన కుంగిన విషయం తెలిసిందే. బ్యారేజీ బీ-బ్లాక్‌లో 19, 20, 21వ పిల్లర్ల మధ్య ఉన్న వంతెన సుమారు - మిగతా 3లో




## అమెరికా మాంద్యం భయాలతో కుప్పకూలిన స్టాక్ మార్కెట్...

- రూ.16 లక్షల కోట్ల సంపద ఆవిరి
- ప్రభుత్వ రంగ బ్యాంకులు, మెటల్, రియల్ ఎస్టేట్, ఇంధనం, మౌలికవసతులు, ఆటోమొబైల్, ఐటీ పరిశ్రమల షేర్లు తీవ్ర కుదుపులు
- నష్టాల నుంచి తప్పించుకున్న హెచ్ యూఎల్, నెస్లే ఇండియా షేర్లు

## యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ
# చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా



- త్వరలోనే అధికారికంగా ఉత్తర్వులు వెలువడే అవకాశం
- వర్సిటీలో 17 కోర్సులు ప్రవేశపెట్టి, ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటన
- యువత వద్ద కేవలం సర్టిఫికెట్లు మాత్రమే ఉంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరకడం కష్టంగా మారిందనే విషయాన్ని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం
- కాగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఇటీవలే అసెంబ్లీ వేదికగా ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి

# బంగ్లాదేశ్ ఎయిర్‌క్రాఫ్ట్ కలకలం



పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో ప్రస్తుత పరిస్థితి నేపథ్యంలో భారత గగనతలంలోకి ఆ దేశ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రవేశించడం కలకలం రేపింది. బంగ్లాదేశ్ వాయుసేనకు చెందిన %జ%-130 ఎయిర్‌క్రాఫ్ట్ భారత గగనతలంలోకి ప్రవేశించింది. ఆ వెంటనే ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అప్రమత్తమైంది.

పరిస్థితిని పరిశీలించేందుకు వాయుసేనకు చెందిన ఓ యుద్ధ విమానాన్ని పంపింది. ఈ యుద్ధ విమానం.. బంగ్లాదేశ్ ఎయిర్‌క్రాఫ్ట్ తిరిగి ఆ దేశ ఎయిర్‌స్పేస్‌లోకి వెళ్లేవరకు ఓ కన్నేసి ఉంచింది. కాగా, బంగ్లాదేశ్‌లో రాజకీయ సంక్షోభం నేపథ్యంలో భారత్‌లో ఎలాంటి పరిస్థితి తలెత్తినా ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని భారత వాయుసేన వర్గాలు తెలిపాయి.

**భారత్ – బంగ్లా సరిహద్దుల్లో హైఅలర్ట్.. అదనపు బలగాలను మోహరిస్తున్న బీఎస్ఎఫ్**

ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల అంశం బంగ్లాదేశ్ లో తీవ్ర అల్లర్లకు కారణమైంది. ఇప్పటికే ఆ దేశంలో వందల సంఖ్యలో నిరసనకారులు మృతి చెందారు. ఆదివారం ఒక్క రోజే పోలీసులు జరిపిన కాల్పుల్లో 100 మంది నిరసనకారులు చనిపోయారు. దీంతో ఆందోళనలు మరింత తీవ్రమయ్యాయి. షేక్ హసీనా రాజీనామా చేయాలని నిరసనకారులు పిలుపునిచ్చారు. దేశం అట్టుడుకుతున్న వేళ.. సోమవారం మధ్యాహ్నం ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా సమర్పించారు. అనంతరం రక్షణ నిమిత్తం ఆమె సీ-130 మిలటరీ విమానంలో భారత్‌కి పయనమయ్యారు. కాగా పొరుగుదేశంలో ఉద్రికత్తల నడుమ భారత్ కూడా అప్రమత్తం అయింది. షేక్ హసీనా భారత్‌కి వస్తున్నారని తెలుసుకున్న నిరసనకారులు మన దేశంలోకి ప్రవేశించే ప్రమాదం ఉండటంతో భారత్- బంగ్లా సరిహద్దులో బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ హైఅలర్ట్ ప్రకటించింది.ల దాదాపు 4,096 కిలోమీటర్ల మేర ఉన్న భారత్- బంగ్లా సరిహద్దులో అదనపు బలగాలను వెంటనే మోహరించాలని బీఎస్ఎఫ్ అధికారులను ఆదేశించింది. అందరూ కమాండర్లు బార్డర్లోనే ఉండాలని సూచించింది. బంగ్లాదేశ్‌లో హింస పెచ్చుమీరుతున్న వేళ, సైన్యం ప్రభుత్వ బాధ్యతలు చేపట్టడంతో నిరసనకారులు భారత్‌లోకి వచ్చే అవకాశం ఉందని అందుకే ఈ చర్యలు చేపట్టినట్లు బీఎస్ఎఫ్ తెలిపింది. ఎలాంటి పరిస్థితులైనా తట్టుకునేందుకు సైన్యం సిద్ధంగా ఉందని బీఎస్ఎఫ్ స్పష్టం చేసింది. ఈ క్రమంలో కూచ్‌బెహార్, పెట్రాపోల్ సరిహద్దుల్లో భద్రత భారీగా పెంచారు. పరిస్థితులను సమీక్షించేందుకు బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ దల్జీత్ సింగ్ ఛౌదరి పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాకు చేరుకున్నారు.

**ఢిల్లీలో నల్లటి వస్త్రాలతో నిరసనలు..**

ఓ వైపు బంగ్లాదేశ్‌లో నిరసనలు జరుగుతుండగా.. ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల వ్యవహారం చర్చనీయాంశం అయింది. ఉద్యోగులంతా తమ జేబులకు నల్లటి వస్త్రాలను చుట్టుకుని ఆఫీసులకు వచ్చారు. అయితే ఇది బంగ్లాదేశ్‌లో జరిగిన హింసాకాండకు వ్యతిరేకంగా నిరసన తెలపడానికా లేదా నిరసనలకు మద్దతు తెలపడానికా అనేది స్పష్టంగా తెలియరాలేదు.

**సైనిక పాలన.. త్వరలోనే తాత్కాలిక ప్రభుత్వం**

షేక్ హసీనా ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేయడంతో ఆ దేశ ఆర్మీ చీఫ్ కీలక ప్రకటన చేశారు. దేశంలో సైనిక పాలన విధిస్తున్నట్టు ప్రకటించారు. శాంతి భద్రతలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తామని స్పష్టం చేశారు. దేశంలోని అన్ని పార్టీలతో చర్చించి ఆందోళనలను అదుపులోకి తీసుకొస్తామని వివరించారు. భద్రత కోసం ప్రధానమంత్రి షేక్ హసీనా దేశం విడిచి వెళ్లిపోయారని, దేశంలో శాంతిని నెలకొల్పేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. బంగ్లాదేశ్‌లో త్వరలోనే తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు కానున్నట్లు తెలుస్తోంది.

బంగ్లాదేశ్ పరిణామాల నేపథ్యంలో భారత్ నుంచి బంగ్లాదేశ్ వెళ్ళే ఎయిర్ ఇండియా విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్లుఎయిర్ ఇండియా ప్రకటించింది. ప్రయాణికులు సహకరించాలని కోరింది.

## కేజ్రీవాల్‌కి దక్కని ఊరట



**ఢిల్లీ:** ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కి షాక్ తగిలింది. ఢిల్లీ హైకోర్టులో ఆయన వేసిన బెయిల్ పిటిషన్‌పై విచారించిన ధర్మాసనం పిటిషన్‌ని కొట్టేసింది. దీంతో బెయిల్‌పై ఆశలు పెట్టుకున్న కేజ్రీవాల్‌కి ఊరట దక్కలేదు. ఈ ఘటనను చట్టవిరుద్ధమైన అరెస్టు అని చెప్పలేమని జస్టిస్ నీనా బన్సల్ కృష్ణతో కూడిన ధర్మాసనం పేర్కొంది. బెయిల్ దరఖాస్తు కోసం కేజ్రీవాల్ ట్రయల్ కోర్టును ఆశ్రయించే స్వేచ్ఛ ఉందని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది.

పిటిషన్లో ఏముందంటే..

లిక్కర్ కేసులో అవినీతి జరిగిందంటూ సీబీఐ తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ హైకోర్టులో పిటిషన్ వేశారు. కేజ్రీవాల్ తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, ఎన్ హరిహరన్, రమేష్ గుప్తా వాదనలు వినిపించారు. సీబీఐ తరఫున ఎస్పీపీ సింగ్ హాజరయ్యారు. ఈ పాలసీపై కేజ్రీవాల్‌తోపాటు అప్పటి లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్ కూడా సంతకం చేశారని సింఘ్వీ వాదించారు. మాజీ ఎల్జీ, బ్యూరోక్రాట్‌లను కూడా నిందితులుగా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు మొత్తం కుంభకోణంలో కేజ్రీవాల్ ప్రమేయం ఉందని, అందుకు తమ వద్ద సాక్ష్యాలు ఉన్నాయని సింగ్ తెలిపారు. అరెస్టు చట్టవిరుద్ధం కాదని ట్రయల్ కోర్టు ఇప్పటికే నిర్ధారణకు వచ్చిందని ఆయన అన్నారు. కేజ్రీవాల్‌పై సీబీఐ ఛార్జిషీట్ దాఖలు చేసిందని.. ముఖ్యమంత్రికి బెయిల్‌పై విడుదలయ్యే అర్హత లేదని సింగ్ పేర్కొన్నారు. సహ నిందితులు మనీష్ సిసోదియా, కె కవితపై ఛార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ కోర్టు బెయిల్ నిరాకరించిన విషయాన్ని గుర్తు చేశారు. 'ఇన్సూరెన్స్ అరెస్ట్' అనే పదాన్ని ఉపయోగించడం సరికాదని ఆయన పేర్కొన్నారు. కేజ్రీవాల్‌కు సీబీఐ ముందస్తు నోటీసు ఇవ్వాల్సిన అవసరం లేదని ఆయన వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ ట్రయల్ కోర్టును ఆశ్రయించకుండానే నేరుగా బెయిల్ కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. లిక్కర్ స్కాం కేసుల్లోనే ఆయన జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ప్రస్తుతం తిహార్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసింది. మేలో, సాధారణ ఎన్నికల దృష్ట్యా జూన్ 01 వరకు సుప్రీంకోర్టు ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జూన్ 2న ఆయన తిరిగి లొంగిపోయారు.

# వయనాడ్ విషాదానికి కారణమదే..

**న్యూఢిల్లీ:** వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి జరిగిన భారీ ఉత్పాతం, ప్రాణనష్టంపై విమర్శలు, ప్రతివిమర్శలు కొనసాగుతున్నాయి. ముందస్తు హెచ్చరికలను కేరళ సర్కార్ పట్టించుకోలేదని కేంద్ర అమిత్‌షా ఇటీవల పార్లమెంటులో చేసిన ప్రకటనను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. ఈ క్రమంలోనే కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ సోమవారం నాడు మరో సంచలన ఆరోపణ చేశారు. వయనాడ్‌లో అక్రమ గనుల తవ్వకాలు, జనవాసాల వల్లే అపార ప్రాణనష్టం జరిగిందని తెలిపారు. అక్రమ జనావాసాలకు స్థానిక రాజకీయవేత్తల రక్షణ ఉందని, కనీసం టూరిజం పేరుతో సరైన జోన్లను కూడా వాళ్లు ఏర్పాటు చేయలేదని, ఈ ప్రాంతంలో భూకబ్జాలు జరిగాయని కేంద్ర మంత్రి ఆరోపించారు. ప్రమాదం జరిగిన ప్రాంతం 'హైలీ సెన్సిటివ్ ఏరియా' అని తెలిపారు. అటవీ శాఖ మాజీ డైరెక్టర్ జనరల్ సంజయ్ కుమార్ సారథ్యంలో తాము ఇప్పటికే ఒక కమిటీ వేశామని, స్థానిక ప్రభుత్వ యంత్రాగం పరిరక్షణలో అక్కడి అక్రమ జనావాసాలున్నాయని, అక్రమ గనుల తవ్వకాలు జరుగుతున్నాయని భూపేందర్ యాదవ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు.



**222కు చేరిన మృతులు**

కాగా, వయనాడ్‌లో గత వారం కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో మరణించిన వారి సంఖ్య 222కు చేరింది. వీరిలో 99 మంది పురుషులు, 88 మంది మహిళలు, 37 మంది పిల్లలు ఉన్నారని సీఎంఓ తాజా గణాంకాలను వెల్లడించింది. వీరిలో 172 మృతదేహాలను బంధువులు గుర్తించారని, వివిధ ప్రాంతాల నుంచి 180 మృతదేహాల విడిభాగాలు లభ్యమయ్యాయని, 161 పోస్టుమార్టంలు పూర్తయ్యాయని తెలిపింది. వయనాడ్, కోజికోడ్, మలప్పురం జిల్లాల్లో 91 మంది చికిత్స పొందుతుండగా, 256 మందిని ఇప్పటికే ఆసుపత్రుల నుంచి డిశ్చార్జి చేశారు.

**జాతీయ విపత్తుగా ప్రకటించేందుకు బీజేపీ నిరాకరణ**

వయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడిన ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో సహా వివిధ వర్గాల నుంచి వస్తున్న డిమాండ్‌ను బీజేపీ తోసిపుచ్చింది. కేంద్ర ప్రభుత్వ గైడ్‌లైన్ ప్రకారం జాతీయ విపత్తుగా ప్రకటించే అవకాశమే లేదని బీజేపీ తెలిపింది. దీనిపై యూపీఏ ప్రభుత్వ హయాం నుంచి విధానపరమైన నిర్ణయంలో ఎలాంటి మార్పు జరగలేదని తెలిపింది. ప్రకృతి వైపరీత్యాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించే ప్రొవిజన్ ఏదీ లేదని 2013 ఆగస్టు 6న అప్పటి హోం మంత్రి ముల్లపల్లి రామచంద్రన్ లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పిన విషయాన్ని బీజేపీ సీనియర్ నేత వి.మురళీధరన్ ఫేస్‌బుక్ పేజ్‌లో పోస్ట్ చేశారు.

## విధుల్లో ఉన్న రైల్వే పోలీసులకు.. ట్రావెల్ అథారిటీ లేదా టిక్కెట్ తప్పనిసరి: రైల్వే



**అహ్మదాబాద్:** విధుల్లో ఉన్న ప్రభుత్వ రైల్వే పోలీస్ (జీఆర్పీ), రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) సిబ్బందికి తప్పనిసరిగా ట్రావెల్ అథారిటీ లేదా రైలు ప్రయాణానికి టికెట్ కొనుగోలు చేయాలని రైల్వే స్పష్టం చేసింది. కేవలం ఐడీ కార్డు మాత్రమే ఉంటే సరిపోదని పేర్కొంది. అధికారిక విధుల్లో ఉండగా ప్రమాదం జరిగినందున పరిహారం కోరుతూ రైల్వే కానిస్టేబుల్ దాఖలు చేసిన పిటిషన్‌ను రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ తోసిపుచ్చింది. అలాగే సిబ్బందికి డ్యూటీ కార్డ్ పాస్‌లను జారీ చేయడంలో రైల్వే నిర్లక్ష్యంపై మండిపడింది. 2019 నవంబర్ 13న జీఆర్పీ కానిస్టేబుల్ రాజేష్ బగుల్ అధికారిక విధుల కోసం గుజరాత్‌లోని సూరత్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. సూరత్-జామ్‌నగర్ ఇంటర్‌సిటీ రైలులో బరూచ్‌కి తిరిగి వస్తుండగా పాలేజ్ స్టేషన్‌లో పడిపోయాడు. ఎడమ కాలుకు తీవ్ర గాయం కావడంతో మోకాలి పైభాగం వరకు తొలగించారు. దీంతో రైల్వే విధుల్లో ఉన్న తాను ప్రమాదానికి గురయై కాలు కోల్పోయానని, వడ్డీతో సహా రూ.8 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని రైల్వేను రాజేష్ డిమాండ్ చేశాడు. దీని కోసం రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాడు.

కాగా, దిగాలనుకున్న స్టేషన్‌ను దాటిన తర్వాత రైలు దిగేందుకు రాజేష్ ప్రయత్నించడంతో పడిపోయి ఉండవచ్చని రైల్వే వాదించింది. అలాగే రైలులో అధికారిక ప్రయాణాన్ని నిరూపించడంలో అతడు విఫలమయ్యాడని పేర్కొంది. తప్పనిసరిగా ట్రావెల్ అథారిటీ కలిగి ఉండాలని లేదా రైలు ప్రయాణానికి సంబంధించిన టికెట్ కొనుగోలు చేయాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో నష్టపరిహారం కోసం అతడు దాఖలు చేసిన పిటిషన్‌ను రైల్వే ట్రిబ్యునల్ కొట్టివేసింది.

## అమెరికా మాంద్యం భయాలతో కుప్పకూలిన స్టాక్ మార్కెట్



భారత స్టాక్ మార్కెట్ కు ఇవాళ అత్యంత ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యాయి. అమెరికా ఆర్థికమాంద్యం భయాలతో భారత స్టాక్ మార్కెట్ సూచీలు కుప్పకూలాయి. ఇవాళ ఒక్కరోజే మదుపరులకు చెందిన రూ.16 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. సెన్సెక్స్ ఏకంగా 2,222 పాయింట్లు నష్టపోయి 78,759 వద్ద ముగిసింది. నిఫ్టీ 662 పాయింట్ల నష్టంతో 24,005 వద్ద స్థిరపడింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు, మెటల్, రియల్ ఎస్టేట్, ఇంధనం, మౌలికవసతులు, ఆటోమొబైల్, ఐటీ పరిశ్రమల షేర్లు తీవ్ర కుదుపులకు గురయ్యాయి. టాటా మోటార్స్, టాటా స్టీల్, ఎస్బీఐ, పవర్ గ్రిడ్, మారుతి సుజుకి, జేఎస్ డబ్ల్యూ స్టీల్, ఇన్ఫోసిస్, ఎల్ అండ్ టీ, టెక్ మహీంద్రా షేర్లు నష్టపోయాయి. హెచ్ యూఎల్, నెస్లే ఇండియా షేర్లు మాత్రం నష్టాల నుంచి తప్పించుకున్నాయి.

## ఐదో వార్షికోత్సవం.. బీజేపీ ర్యాలీ..
# అమర్నాథ్ యాత్ర నిలిపివేత

**శ్రీనగర్ :** మోదీ ప్రభుత్వం 'ఆర్టికల్ 370'ని రద్దు చేసి.. నేటికి అంటే ఆగస్ట్ 5వ తేదీకి అయిదేళ్లు పూర్తయింది. ఈ నేపథ్యంలో జమ్మూ కశ్మీర్‌లో ఆర్ఎస్ పురాలోని బానా సింగ్ స్టేడియంలో ఏకాత్మ మహోత్సవ ర్యాలీని బీజేపీ చేపట్టనుంది. సరిగ్గా అయిదేళ్ల క్రితం ఇదే రోజున అంటే.. 2019, ఆగస్ట్ 5వ తేదీన ఆర్టికల్ 370ని మోదీ ప్రభుత్వం రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏకాత్మ మహోత్సవ్ పేరిట ర్యాలీ నిర్వహించాలని బీజేపీ సంకల్పించింది.

**మోదీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ఫైర్..**

మరోవైపు ఈ రోజును ప్రతిపక్షాలు బ్లాక్ డేగా అభివర్ణించాయి. జమ్మూ కశ్మీర్‌కు సంబంధించిన ఆర్టికల్ 370 రద్దు చేయడంతో మోదీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు మండిపడుతున్న సంగతి అందరికి తెలిసిందే. అంతేకాదు.. ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు సైతం స్పందిస్తున్నారు. ఈ ఆర్టికల్ రద్దు చేసిన ఈ అయిదేళ్లలో ఏం సాధించారని బీజేపీని జమ్మూ కశ్మీర్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి రవీంద్ర శర్మ ప్రశ్నించారు. అందుకు సంబంధించి.. ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత బీజేపీపై ఉందని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రజలకు తగిలిన గాయాలపై కారం జల్లుతుందంటూ బీజేపీపై మండిపడ్డారు. ఆర్టికల్ రద్దు చేసి.. నేడు వేడుకలు జరపడం సిగ్గు చేటంటూ బీజేపీకి చురకలంటించారు. ఆర్టికల్ 370 రద్దుకు నిరసనగా మహారాజా హరిసింగ్ పార్క్ వద్ద ఈ రోజు ఆందోళన నిర్వహిస్తామని డెమోక్రటిక్ ప్రొగసీవ్ ఆజాద్ పార్టీ (డీపీఏపీ) ప్రతినిధి పేర్కొన్నారు.

**ఈ రోజు అమర్నాథ్ యాత్రకు విరామం..**

ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో అధికార బీజేపీ వేడుకలు నిర్వహించేందుకు సిద్ధమైంది. మరోవైపు ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. ఈ నేపథ్యంలో అమర్నాథ్ యాత్రకు ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం విరామం ప్రకటించింది. దీంతో అమర్నాథ్ యాత్రికులు భగవత్ క్యాంప్‌లో ఉండిపోయారు.



ఇంకోవైపు ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రభుత్వం పట్టిష్టమైన భద్రత చర్యలు చేపట్టింది.

**రెండోసారి అధికారం చేపట్టిన కొద్ది రోజులకే..**

2019 ఎన్నికల్లో నరేంద్ర మోదీ వరుసగా రెండో సారి అధికారాన్ని చేపట్టారు. ఆ కొద్ది రోజులకే ఆయన జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక అధికారాలున్న ఆర్టికల్ 370ని రద్దు చేశారు. దాంతో ఆ ఆర్టికల్ రద్దు అయి నేటికి అయిదేళ్లు పూర్తి అయింది.

**అసెంబ్లీ ఎన్నికలకు సీఈసీ సన్నాహకాలు..**

మరోవైపు జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహకాలు చేస్తుంది. అందులోభాగంగా ఆగస్ట్ 8వ తేదీ నుంచి ఆగస్ట్ 10వ తేదీ వరకు మూడు రోజుల పాటు కేంద్ర ఎన్నికల సంఘం ఆ రాష్ట్రంలో పర్యటించనుంది. అనంతరం కొద్దిరోజులకే అసెంబ్లీ ఎన్నికల నగారాను మోగించనున్నదని తెలుస్తుంది. ఇంకోవైపు ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జమ్మూ కశ్మీర్ ప్రజలు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. అయితే ఆర్టికల్ 370 రద్దు అనంతరం తొలిసారిగా జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు కావడంతో ప్రపంచవ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఆసక్తిని కనబరుస్తున్నారు.

## నా రాజీనామా అడిగే నైతిక హక్కు యెడ్యూరప్పకు లేదు



కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి పాలన సాగిస్తోందని, సీఎం సిద్ధరామయ్య తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని.. ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత యెడ్యూరప్ప చేసిన వ్యాఖ్యలు రాజకీయ వేడి రగిలించాయి. అయితే ఈ వ్యాఖ్యలను సీఎం సిద్ధరామయ్య తీవ్రంగా ఖండించారు. యెడ్యూరప్పపై ఉన్న కేసుల గురించి గుర్తుచేశారు. తన రాజీనామా అడిగే హక్కు ఆయనకు లేదన్నారు. యెడ్యూరప్ప డిమాండ్‌ను ప్రస్తావించిన మీడియాతో సిద్ధరామయ్య మాట్లాడుతూ.. 'యెడ్యూరప్పపై పోక్సో కేసు ఉంది. ఆయనపై ఎన్ని కేసులు ఉన్నాయో మీకు తెలుసా..? ఆయన రాజకీయాల్లో ఉండవచ్చా..? నా రాజీనామా అడిగేందుకు ఆయనకు ఏ నైతిక హక్కు ఉన్నది..? ఆయనపై చార్జిషీట్ దాఖలైంది. కోర్టు బెయిల్ ఇచ్చింది కాబట్టి ఆయన బయట ఉన్నారు. లేదంటే పోక్సో కేసులో జైల్లో ఉండేవారు.' అని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలోని 21 కేసులపై తాము విచారణకు ఆదేశించామని, ఆదేవిధంగా మిగతా కేసులలో కూడా విచారణకు ఆదేశిస్తామని సిద్ధరామయ్య వెల్లడించారు.

# హైదరాబాద్‌లో కాగ్నిజెంట్ కొత్త సెంటర్

-మొదటిపేజీ తరువాయి

కుదిరింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... హైదరాబాద్ సహా తెలంగాణలో ఐటీ రంగానికి మరింత అనుకూలమైన వాతావరణం కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాగ్నిజెంట్ విస్తరణ, కొత్త సెంటర్ ఏర్పాటుతో అంతర్జాతీయ టెక్ సంస్థలు హైదరాబాద్‌ను తమ గమ్యస్థానాలుగా ఎంచుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగ్నిజెంట్ కంపెనీకి అవసరమైన సహకారం తప్పకుండా ఉంటుందన్నారు. కొత్త సెంటర్ ఏర్పాటుతో వేలాదిమంది యువతకు ఉద్యోగాలు వస్తాయన్నారు. ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపుతుందన్నారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని టైర్ 2 కంపెనీలకు ఐటీ సేవలను విస్తరించాలని సీఎం సూచించారు. ఈ సూచనకు కంపెనీ ప్రతినిధులు సానుకూలత వ్యక్తం చేశారు. ప్రముఖ టెక్ కంపెనీలన్నీ హైదరాబాద్ వైపు చూస్తున్నాయని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. సాంకేతికత, కొత్త ఆవిష్కరణలకు అభివృద్ధి కేంద్రంగా హైదరాబాద్ ఉందని, ఈ నగరం అందరి దృష్టిని ఆకర్షిస్తోందని కాగ్నిజెంట్ సీఈవో రవి కుమార్ అన్నారు. ఈ కారణంగానే హైదరాబాద్‌లో తమ కంపెనీ విస్తరణకు మొగ్గు చూపామన్నారు. టెక్నాలజీ, ఇన్నోవేషన్ హబ్‌గా సత్తా చాటుకుంటున్న హైదరాబాద్‌లో తమ కంపెనీ విస్తరించడం సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న తమ కొత్త సెంటర్ ద్వారా తమ క్లయింట్స్‌కు మరిన్ని మెరుగైన సేవలను అందిస్తామన్నారు. ఐటీ సేవలతో పాటు కన్సల్టింగ్ లో అత్యాధునిక పరిష్కారాలను అందిస్తుందన్నారు. ఏఐ, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజినీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్‌తో సహా వివిధ ఆధునాతన సాంకేతికతలపై ఈ కొత్త సెంటర్ ప్రత్యేక దృష్టి సారించనుందని తెలిపారు.

# యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా

వాషింగ్టన్: అగ్రరాజ్యం అమెరికా పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. తెలంగాణ ఏర్పాటు చేయబోతున్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి చైర్మన్‌గా మహీంద్రా అండ్ మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్ర పేరును ప్రకటించారు. ఆనంద్ మహీంద్రాను ఈ మేరకు నియమించబోతున్నట్టు అమెరికాలో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకకు త్వరలోనే అధికారికంగా ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.
కాగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవలే అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. ఈ మేరకు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్కిల్ వర్సిటీ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై చర్చ జరిగింది. వర్సిటీలో 17 కోర్సులు ప్రవేశపెట్టి, ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. యువత వద్ద కేవలం సర్టిఫికెట్లు మాత్రమే ఉంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరకడం కష్టంగా మారిందనే విషయాన్ని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం.. పోటీ ప్రపంచానికి అనుగుణంగా నైపుణ్యాలు పెంపొందించడమే లక్ష్యంగా ఈ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతోంది. యూనివర్సిటీలో యువతకు



సాంకేతిక నైపుణ్యాలు నేర్పించనున్నారు.

**ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో వర్సిటీ నిర్వహణ..**

ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని నిర్వహించనున్నారు. సర్టిఫికెట్ కోర్సులను మూడు రకాలుగా అందించనున్నారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న స్కిల్ వర్సిటీలో డిగ్రీ పట్టా ఇవ్వాలని నిర్ణయించారు. ఫీజు ఏడాదికి రూ.50 వేలుగా నిర్ణయించినట్టు ప్రభుత్వం అసెంబ్లీలో పేర్కొంది. ఇక రీయింబర్స్‌మెంట్, హాస్టల్ వసతి కల్పిస్తామని తెలిపింది. తాత్కాలికంగా హైదరాబాద్‌లోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో 1500 మందికి, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్)లో 500 మందికి 6 కోర్సుల్లో తరగతులు ప్రారంభిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆ తర్వాత క్రమక్రమంగా యూనివర్సిటీని భవిష్యత్తులో జిల్లాలకూ విస్తరిస్తామని తెలంగాణ ప్రభుత్వం చెప్పింది. రాష్ట్రంలో 20 లక్షల మందికి పైగా యువత ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారని, అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం సాధ్యం కాదు కాబట్టి వీలైనన్ని అవకాశాలను కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెప్పారు. 2 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని, ఇందుకోసం త్వరలోనే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు చెప్పిన విషయం తెలిసిందే. ఆరోగ్యం, ఔషధాలు, కృత్రిమ మేధ, లైఫ్ సైన్సెస్, బ్యాంకింగ్, యానిమేషన్ వంటి 12 రంగాలకు చెందిన బోధన ఉంటుందన్నారు. వర్సిటీ కోసం ముచ్చర్లలో 57 ఎకరాల భూమిని కేటాయించామని, అక్కడ శాశ్వత క్యాంపస్ ఏర్పాటవుతుందని మంత్రి శ్రీధర్‌బాబు అసెంబ్లీ ప్రకటించిన విషయం తెలిసిందే.

# గోదావరి గలగల... మానేరు వెలవెల....!

**కరీంనగర్ :** ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రధాన నీటి వనరు మానేరు. మానేరు పై నిర్మించిన ఎగువ మానేర్, మధ్య మానేర్, లోయర్ మానేర్ డ్యామ్ ల్లో నీళ్లు ఉంటే ఉమ్మడి కరీంనగర్ జిల్లాకే కాదు పొరుగున ఉన్న వరంగల్, ఖమ్మం, సిద్దిపేట జిల్లాల్లో నీటి కష్టాలు తీరుతాయి. కానీ ప్రస్తుతం మానేర్ డ్యాముల్లో నీళ్ల లేని, ఆశించిన స్థాయిలో వర్షాలు లేక వరదరాని పరిస్థితి కనిపిస్తోంది. వర్షాకాలం ఆరంభం నుంచి అంటే జూన్ 1 నుంచి ఇప్పటి వరకు వర్షాల ఆధారంగా లోయర్ మానేర్ డ్యామ్ కు అర టీఎంసీ నీళ్ల రాగ, మిడ్ మానేర్ కు ఒక టీఎంసీ నీరు వచ్చి చేరింది.ఇక అప్పర్ మానేర్ నర్మాల ప్రాజెక్టు కు మాత్రం వెయ్యి క్యూసెక్కుల నీరు కూడా రాని పరిస్థితి. దీంతో మానేర్ డ్యాములు వెలవెలబోగా, దిగువన ఉన్నటువంటి గోదావరిలో మాత్రం వరద ఉధృతి కొనసాగుతుంది.ఇటీవల ఎగువన మహారాష్ట్ర ఆదిలాబాద్ జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో గోదావరి వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరడంతో 20.175 టీఎంసీల నీటి నిలువ సామర్థ్యంగల ఎల్లంపల్లి ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. ప్రస్తుతం 15 టిఎంసీల నీళ్ళు ఉన్నాయి. ఇప్పటికే 9టిఎంసీల నీటిని మిడ్ మానేర్ కు ఎత్తిపోతల ద్వారా తరలించారు.ఎల్లంపల్లి ప్రాజెక్టు దిగువన కాళేశ్వరం ప్రాజెక్టులలో భాగంగా గోదావరిపై నిర్మించిన సుందిళ్ళ వద్ద పార్వతి బ్యారేజ్, అన్నారం వద్ద సరస్వతి బ్యారేజ్ కి స్వల్పంగా వరద ఉండగా మేడిగడ్డ వద్ద లక్ష్మి బ్యారేజ్ కి భారీగా వరద కొనసాగుతుంది. త్రివేణి సంగమం కాళేశ్వరం దిగున మేడిగడ్డ లక్ష్మి బ్యారేజ్ ఉండడంతో గోదావరి తో పాటు ప్రాణహిత నది నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో మేడిగడ్డ లక్ష్మి బ్యారేజ్ అన్ని గేట్లు ఎత్తి రోజుకు ఎనిమిది లక్షలకు పైగా క్యూసెక్కుల నీటిని దిగువకు వృధాగా వదలతున్నారు.శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు కు పైనుంచి రోజుకు ఒక టీఎంసీ నీరు వచ్చి చేరుతుంది. దీంతో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి రోజుకు ఒక టీఎంసీ నీటిని కాళేశ్వరం ప్రాజెక్టులోని నంది పంప్ హౌస్, గాయత్రి పంప్ హౌస్ ద్వారా మిడ్ మానేర్ కు నీటిని లిఫ్ట్ చేస్తున్నారు. శ్రీపాదఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి రోజుకు ఒక టీఎంసీ చొప్పున నీటిని లిఫ్ట్ చేస్తుండడంతో మిడ్ మానేర్ రిజర్వాయర్ జళకళను సంతరించుకుంది. 27.5 టీఎంసీల నీటి నిలువ సామర్థ్యం గల మిడ్ మానేర్ లో ప్రస్తుతం 15 టీఎంసీలకు



నీరు చేరింది.ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నంది పంప్ హౌస్ ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని నాలుగు పంపుల ద్వారా ఎగువన ఉన్న గాయత్రి పంప్ హౌస్ కు తరలిస్తున్నారు. గాయిత్రి పంప్ హౌస్ లోని నాలుగు పంపుల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని లిఫ్ట్ చేసి ఎస్సారెస్పీ వరద కాలువ ద్వారా మిడ్ మానేర్ కు తరలిస్తున్నారు. పది రోజుల నుంచి రోజుకు ఒక టీఎంసీ చొప్పున ఇప్పటివరకు మిడ్ మానేర్ కు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 10 టీఎంసీల నీటిని తరలించారుమరో ఐదు టీఎంసీల నీరు తరలించిన తర్వాత మిడ్ మానేర్ లో 20 టీఎంసీలకు నీరు చేరుకోగానే ఎడారిని తలపిస్తున్న ఎల్ఎండి కి మిడ్ మానేర్ నుంచి 10 టిఎంసీల నీటిని తరలించాలని నిర్ణయించారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నీటితో మిడ్ మానేర్, లోయర్ మానేర్ డ్యాంలను పూర్తిస్థాయిలో నింపి ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఖమ్మం, సిద్దిపేట జిల్లాల నీటి కష్టాలను తీర్చే పనిలో ప్రభుత్వం నిమగ్నమైంది.సమీపంలోని లోయర్ మానేర్ డ్యామ్ ఎడారిని తలపిస్తుంది. 24 టీఎంసీల నీటి నిలువ సామర్థ్యం గల ఎల్ఎండి లో ప్రస్తుతం 5.36 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఎగువన మోయతుమ్మెద వాగు నుంచి 206 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా అదే స్థాయిలో మంచినీటి కోసం 206 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.వర్షాకాలం ఆరంభం నుంచి ఇప్పటివరకు గడిచిన రెండు మాసాల్లో ఎల్ఎండికి వర్షాల ఆదారంగా అర టీఎంసీ నీళ్ళు కూడా రాని పరిస్థితి ఉంది. ప్రస్తుతం డ్యామ్ లో ఉన్న నీళ్లు కరీంనగర్ సిద్దిపేట జిల్లాలతో పాటు మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు త్రాగునీటి అవసరాలకు కూడా సరిపోదు. ఇలాంటి పరిస్థితిలో ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేర్ కు తరలిస్తున్న నీటిని ఎల్ఎండికి విడుదల చేయాలని స్థానికులు కోరుతున్నారు.ఎల్లంపల్లి నుంచి నీటిని ఎత్తిపోస్తుండడంతో మిడ్ మానేర్ కు జలకళ సంతరించుకుంది. మిడ్ మానేర్ రిజర్వాయర్ లో సగానికి పైగా నీళ్లు చేరుకోవడంతో నాలుగైదు రోజుల్లో మిడ్ మానేర్ళ గేట్లు ఎత్తి ఎల్లుండికి పది టీఎంసీల నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. అందుకు అనుగుణంగా అటు ప్రభుత్వం, ఇటు ఇరిగేషన్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.గడిచిన పదేళ్లలో ఎప్పుడు లేనంతగా మానేర్ డ్యామ్ లు నీటి కష్టాలను ఎదుర్కొంటున్నాయి. ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతల పథకం పై ఆధారపడి మానేర్ డ్యామ్ లు పని చేసే పరిస్థితి నెలకొంది.

# భారీగా పట్టుబడుతున్న గంజాయి....

**హైదరాబాద్ :** హైదరాబాద్ లో భారీ స్థాయిలో గంజాయి పట్టుబడింది. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఎస్వోటీ (స్పెషల్ ఆపరేషన్ టీమ్) పోలీసులు ఈ గంజాయిని గుర్తించారు. దాదాపు 800 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బాలానగర్ ఎస్వోటీ, శంషాబాద్ పోలీసులు కలిసి ఈ జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.2.94 కోట్ల విలువ ఉంటుందని పోలీసులు చెప్పారు. 800 కేజీల గంజాయి కంటెయినర్ లో ఓ వాహనం ఒడిశా నుంచి మహారాష్ట్రకు హైదరాబాద్ మీదుగా వెళ్తున్నట్లుగా విచారణలో పోలీసులు గుర్తించారు.ఈ స్థాయిలో గంజాయి తరలిస్తూ పట్టుబడటం ఇదే తొలిసారని పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. డీసీఎం డ్రైవర్ లు సంజీవ్ విఠల్ రెడ్డి, హోల్లప్ప, సప్లయర్ సునీల్ ఖోస్లా, జాగ సునాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ దందాకు మూలకారకులైన వారి గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. అరకుకు చెందిన వ్యక్తి గంజాయి సరఫరాదారుగా ఉన్నాడని, అతని పేరు రాము అని తెలిపారు. అతను ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు చెప్పారు. ఇతను చాలా పెద్ద మొత్తంలో గంజాయిని ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తుంటాడని పోలీసులు చెప్పారు. కమిషన్ ఎజెంట్ కం ట్రాన్స్‌పోర్టర్ గా ఒడిశాకి చెందిన సోమ్ నాథ్ ఖారా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. రాము అనే వ్యక్తి గతంలో గంజాయి రవాణా చేస్తూ అరెస్ట్ అయ్యాడు. మెయిన్ పెడ్లర్ కం రిసీవర్ సురేష్ మారుతి పాటిల్ కూడా పరారీలో ఉన్నాడు. “ఇలా గంజాయి ట్రాన్స్‌పోర్ట్ చేసినందుకు ప్రతిసారి రూ.2 లక్షలు రూపాయలు తీసుకుంటారు. నిందితులు అంతా కలిసి ఎంతకాలంగా గంజాయి సప్లై చేస్తున్నారో విచారిస్తున్నాం. ప్రధాన నిందితుడు రాముతో పాటు సురేష్ అనే వ్యక్తి పరారీలో ఉన్నాడు. పోలీస్ నిఘా తప్పించుకోవడానికి కంటైనర్ ముందు నిందితులు కార్ లో ఎస్కార్ట్ గా వచ్చారు. కంటైనర్ కు రెండు మూడు కిలోమీటర్ల దూరంలో ఉండి ఎక్కడైనా పోలీసుల తనిఖీలు ఉంటే అప్రమత్తం చేస్తారు. పోలీసుల నిఘానుండే తప్పించుకోవడానికి టోల్గేట్ వద్దకు కంటైనర్ రాంగానే వాహనం నంబర్ ప్లేట్ మారుస్తారు. నిందితులపై అనుమానంతో 15 నుండి 25 రోజులు వరకు ఈ కేసు పై వర్కౌట్ చేసాం. నిందితులు ఒరిస్సా నుండి గంజాయి తీసుకువచ్చి పటాన్చెరువు వద్ద మరొక వెహికల్ లో గంజాయిని మారుస్తారు. మార్చిన ఆ వెహికల్ లో గంజాయిని మహారాష్ట్రకు తీసుకువెళ్తారు.విట్టల్ రెడ్డి పరవాడ సెజ్ లో సాల్వెంట్ డ్రమ్ములను కంటైనర్ లోడ్ చేసుకున్నాడు. కంటైనర్ ముందు భాగంలో సాల్వెంట్ డ్రమ్స్ పెట్టి వెనకాల భాగంలో గంజాయి ఉంచారు. కెమికల్స్ డ్రమ్ములను కూడా జీఎస్టి వేబిలు లేకుండా తరలిస్తున్నారు. ఆ కెమికల్ సాల్వెంట్స్ ఏంటి అన్న అంశంపై కూడా విచారణ చేస్తాం. మొత్తం ఏడుగురు నిందితులు గంజాయి సప్లై లో భాగంగా ఉన్నారు..ఇందులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసాం. మిగతా ముగ్గురు నిందితులను పరారీలో ఉన్నారు..

## రైతులకు కొత్త రుణాలు

-మొదటిపేజీ తరువాయి

బ్యాంకుల్లో రైతులు రుణమాఫీ విషయంలో ఎక్కువ ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని చెప్పారు. ఈ విషయాన్ని వెంటనే బ్యాంకు అధికారులతో సమన్వయం చేసుకొని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ముజిమిల్ ఖాన్, బ్యాంకు అధికారులను ఆదేశించారు. బ్యాంకింగ్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకే అకౌంట్ ద్వారా సుమారు రూ.30 వేల కోట్ల జమ అయ్యాయని చెప్పారు. ఏకకాలంలో, ఒకే అకౌంట్ నుంచి ఇంత మొత్తం ఎన్నడు బ్యాంకుల్లో జమ కాలేదని అన్నారు. రైతులకు సహకరించాలని బ్యాంకు అధికారులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు.

## మాజీ సీఎం కేసీఆర్ బిగ్ షాక్

-మొదటిపేజీ తరువాయి

30 మీటర్ల పొడవున.. ఒక ఫీటు వరకు కిందికి కుంగింది. రాత్రివేళ వంతెన కుంగిపోయిన విషయాన్ని మహరాష్ట్ర వెళ్లే ప్రయాణికులు గుర్తించి బయటకు చెప్పడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇదంతా బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యంతోనే జరిగిందంటూ విపక్షాలు అప్పట్లో మండిపడిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ప్రభుత్వం మారడం.. బ్యారేజీని పరిశీలించడం అన్ని జరిగాయి. ఇటీవలే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా ప్రాజెక్టును సందర్శించారు.

## స్థానికతపై ప్రతిపాదనలు...

**హైదరాబాద్ :** జీవో 317 పై ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ వరుస సమావేశాలను నిర్వహిస్తోంది. శనివారం హైదరాబాద్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర వైద్యారోగ్య మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన సమావేశం అయింది. కమిటీ సభ్యుడిగా ఉన్న మంత్రి శ్రీధర్ బాబు ఇందులో పాల్గొన్నారు. 317 జీవో పై స్థానికతకు సంబంధించి రెండు రకాల ప్రతిపాదనలను సాధారణ పరిపాలన శాఖ క్యాబినెట్ సబ్ కమిటీ ముందు ప్రతిపాదించింది. అయితే సాధారణ పరిపాలన శాఖ ప్రతిపాదించిన అంశాలపై ఆ శాఖ ముఖ్య కార్యదర్శి రాష్ట్ర అడ్వకేట్ జనరల్ తో సంప్రదించాలని సూచించింది. ఆ తర్వాత తుది నివేదికను క్యాబినెట్ సబ్ కమిటీకి సమర్పించాలని ఆదేశించింది.అదేవిధంగా జీవో 46 కు సంబంధించిన అంశాలపై మంత్రివర్గ ఉపసంఘం న్యాయ నిపుణులతో చర్చించింది. సాధ్యమైనంత త్వరగా జీవో 317 సమస్యలను పరిష్కారించాలనే ఉద్దేశ్యంతో సబ్ కమిటీ పని చేస్తోంది. క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి బెన్హార్ మహేష్ దత్ ఎక్కా, శివశంకర్ (రిటైర్డ్ ఐఎయస్ ), బుసాని వెంకటేశ్వరరావు (రిటైర్డ్ ఐఏఎస్) క్యాబినెట్ సబ్ కమిటీ కన్సల్టెంట్, జాయింట్ సెక్రెటరీ సర్వీసెస్, జి సునీత దేవి, సహాయ కార్యదర్శి మల్లికార్జున్, ఇతర అధికారులు పాల్గొన్నారు.గతంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం 317 జీవోను తీసుకొచ్చింది. రాష్ట్రంలో కొత్త జోన్ల వ్యవస్థ అమలులోకి రావటంతో.. కొత్త జిల్లాలకు, కొత్త జోన్లకు, మల్టీ జోన్లకు.. ఉద్యోగాలను, ఉద్యోగులను సర్దుబాటు చేసే ప్రక్రియను నాటి ప్రభుత్వం ప్రారంభించింది. 2021 డిసెంబర్ 6వ తేదీన ఈ జీఓను జారీ చేసింది. పాత జిల్లాలు, జోన్లు, మల్టీ జోన్లలోని ఉద్యోగులు.. ఆ పాత జిల్లాలు, జోన్లు, మల్టీ జోన్ల పరిధిలోని కొత్త జిల్లాలు, కొత్త జోన్లు, కొత్త మల్టీ జోన్లలో తాము కోరుకున్న చోటుకు వెళ్లటానికి ఆప్షన్ ఎంచుకునే అవకాశం కల్పించింది.ఈ ఆప్షన్లకు ఆ కేడర్ పోస్టులో సీనియారిటీని ప్రధాన ప్రాతిపదికగా నిర్ణయించింది. వికలాంగులతో పాచు పలు తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నవారికి ప్రత్యేక ప్రాధాన్యత కింద ఆప్షన్లు ఎంచుకునే వెసులుబాటును కల్పించింది. అయితే మల్టీ జోనల్, జోనల్ కేడర్ పోస్టుల్లో కన్నా జిల్లా కేడర్ ఉద్యోగుల సర్దుబాటుపై ముఖ్యంగా ఉపాధ్యాయుల నుంచి తీవ్రస్థాయిలో నిరసనలు వ్యక్తమమయ్యాయి. జీఓ 317ను వ్యతిరేకిస్తూ డిసెంబర్ చివరి నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు.ఉద్యోగుల స్థానికతను 317 జీఓ పరిగణనలోకి తీసుకోవటం లేదని ప్రధానంగా ఉద్యోగస్తులు ఆరోపిస్తున్నారు. స్థానికంగా పని చేయాల్సిన తమను వేరే జిల్లాలకు బదిలీ చేస్తున్నారని చెబుతున్నారు. కేవలం ఉపాధ్యాయులు మాత్రమే కాదు.. చాలా శాఖల్లోని ఉద్యోగస్తులు అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నారుఈ సమస్యలను పరిష్కరించేందుకు తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రివర్గం ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. మంత్రి దామోదర రాజనర్సింహ్మా అధ్యక్షతన సబ్ కమిటీ ఏర్పాటు కాగా? జీవో 317 సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తోంది. వారంలో ఒక్కసారైనా సమావేశం అవుతూ? త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని భావిస్తోంది

## ఈ సారైనా కల నెరవేరుతుందా.,..

## శ్రీశైలం ఎడమగట్టు కాల్వ పై ఆశలు

**నల్గొండ :** భూగర్భ జలాల్లో అత్యధికంగా ఫ్లోరైడ్ ఉన్న ప్రాంతంగా నల్గొండ జిల్లా గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కింది. సాగునీటి సమస్య వల్ల భూగర్భ జలాలపై ఆధారపడే ఇక్కడ రైతాంగానికి, అదే మాదిరిగా ఫ్లోరైడ్ నీటితో శరీరాలు అష్టవంకరలు తిరిగిన బాధితులకు సురక్షితమైన ఉపరితల సాగునీటిని అందించేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టులు నిరాశపరుస్తున్నాయి.ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజలు దశాబ్దాల అలుపెరగని పోరాటాల ఫలితంగా శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్.ఎల్.బి.సి) ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని దేవరకొండ, మునుగోడు, నాగార్జున సాగర్, మిర్యాలగూడెం, నల్గొండ, నకిరేకల్ ఆరు నియోజకవర్గాలు అంటే, సగం జిల్లాకు ఈ ప్రాజెక్టు ద్వారా 3 నుంచి 4 లక్షల ఎకరాలకు సాగునీరు, 516 ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు తాగునీరు అందించే లక్ష్యంతో మొదలైన శ్రీశైలం సొరంగం ప్రాజెక్టు (ఎస్.ఎల్.బి.సి ప్రాజెక్టు) పనులు గడిచిన దశాబ్ద కాలంగా అడుగు ముందుకు పడలేదు. కృష్ణా నదిలో వరద నీటిని శ్రీశైలం రిజర్వాయర్ నుంచి సొరంగం మార్గంలో జిల్లాకు తరలించే ఈ ప్రాజెక్టుకు నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా 2005 లో శంకుస్థాపన చేశారు.ఈ ప్రాజెక్టులో 44 కిలోమీటర్ల నిడివిలో సొరంగం తవ్వాల్సి ఉంటుంది. రూ.1920 కోట్ల అంచనా వ్యయంతో మొదలైన ఈ ప్రాజెక్టు తాజా అంచనా రూ.3152 కోట్లకు చేరింది. పనుల పూర్తికి రూ.4468 కోట్లు అవసరమని ఇరిగేషన్ శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. కాగా, రాష్ట్ర తాజా బడ్జెట్లో శ్రీశైలం సొరంగం మార్గానికి రూ.800 కోట్లు కేటాయించడంతో పనులు వేగవంతంగా జరుగుతాయన్న ఆశాభావం వ్యక్తం అవుతోంది.శ్రీశైలం రిజర్వాయర్ వెనుక నుంచి తవ్వే సొరంగం ద్వారా జిల్లాకు నీరివ్వాలి. 44 కిలోమీటర్ల నిడివిలో రెండు సొరంగాలను తవ్వాల్సి ఉంటుంది. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి వచ్చే టన్నెల్ 1, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మన్నెవారిపల్లి వద్ద పూర్తవుతుంది. దీని నిడివి 43.5 కిలోమీటర్లు. ఇందులో ఇంకా 9 కిలోమీటర్ల సొరంగం పనులు పెండింగులో ఉన్నాయి. నల్గొండ జిల్లా చందంపేట మండలం తేల్దేవర్ పల్లి వద్ద టన్నెల్ 2 ప్రారంభమై నేరెడుగొమ్ము వద్ద పూర్తవుతుంది. ఈ సొరంగం నిడివి 7 కిలోమీటర్లు. మొత్తంగా ఈ ప్రాజెక్టు పరిధిలో మరో 10 కిలోమీటర్ల సొరంగం పనులు పూర్తయితే కానీ నీరందే పరిస్థితి కనిపించడం లేదు. రెండు టన్నెల్స్ పనులు రెండు వైపులా మొదలు పెడితే నెలకు 300 మీటర్ల చొప్పున 33 నెలల పాటు నిరంతరాయంగా పనులు చేస్తేనే పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. శ్రీశైలం రిజర్వాయర్ నిండుకుండను తలపిస్తోంది. ఇప్పటికే శ్రీశైలం నుంచి దిగువకు కృష్ణా నదిలోకి అన్ని గేట్లు ఎత్తి దాదాపు 4 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం పూర్తిగా నిండి ఉండడంతో టన్నెల్ 1 లోకి సీపేజీ నీరు చేరుతుండడంతో వాటిని మూడు దశల్లో 20హెచ్.పి, 30 హెచ్.పి మోటార్లతో తోడి పోస్తున్నారు. దీనికే నెలకు సుమారు రూ.2 కోట్ల విద్యుత్ బిల్లులు అవుతున్నాయని కాంట్రాక్టు సంస్థ వాపోతోంది. దీనివల్ల పనులకూ అంతరాయం జరుగుతోంది. టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) వస్తున్న మరమ్మతులు, ప్రభుత్వం నుంచి గతంలో పెద్దమొత్తంలో బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం వంటి కారణాలతో పనులుబాగా నెమ్మదించాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టును పూర్తి చేస్తామని ప్రకటించడం, ఈ ఏడాది బడ్జెట్ లో ఆరు ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇస్తామని, వచ్చే ఏడాది మరో 12 ప్రాజెక్టులను పూర్తి చేస్తామని పేర్కొని ఎస్.ఎల్.బి.సి టన్నెల్ ప్రాజెక్టుకు రూ.800 కోట్లు కేటాయించడంతో పనుల పూర్తిపై ఆశలు చిగురిస్తున్నాయి.నల్లగొండ జిల్లాలో సుమారు 3.20 లక్షల ఎకరాలకు సాగునీరు, వందల గ్రామాలకు సాగునీరు ఇచ్చే శ్రీశైలం సొరంగం పనులు ఇరవై ఏళ్లయినా పూర్తికావడం లేదు. రూ.1925 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభమైన పనులు నేటికి రూ.4658 కోట్ల అంచనా వ్యయానికి చేరింది. 10 కి.మీ. సొరంగం తవ్వాల్సి ఉంది. బడ్జెట్‌లో కేటాయించిన రూ. 800 కోట్లు సరిపోవు, ఎక్కువ నిధులు ఇచ్చి పనుల పూర్తికి కాలపరిమితి నిర్ణయించాలి, పర్యవేక్షణ కమిటీని వేయాలి..” అని సీపీఎం నాయకత్వం ఇటీవల సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కోరింది

# దళిత మహిళపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

## - దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలి
## - ధర్మ సమాజ్ పార్టీ స్టేట్ సెక్రటరీ స్టేట్ అన్నెల లక్ష్మణ్

**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** షాద్ నగర్ లో దళిత మహిళపై పోలీసులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ధర్మసమాజ్ పార్టీ స్టేట్ సెక్రటరీ అన్నెల లక్ష్మణ్ అన్నారు. సోమవారం ఆయన సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. షాద్ నగర్ పోలీసులు ఎలాంటి తప్పు చేయకున్న దళిత మహిళను తీవ్రంగా కొట్టి హింసించడాన్ని ఆయన ఖండిస్తూ మాట్లాడారు. ఏదైనా తప్పు చేస్తే చట్టం ప్రకారం కేసు నమోదు చేసి విచారణ జరపాల్సి ఉండగా కేసు నమోదు చేయకుండానే థర్డ్ డిగ్రీ ఒక మహిళ అని చూడకుండా తీవ్ర హింస పెట్టిన పోలీస్ అధికారికి కఠిన శిక్ష వేయడంతో పాటుగా ఆయన ఉద్యోగం నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి హింస మరోసారి పునరావృతమైతే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలు నిరుపేదలైన దళిత గిరిజనలపై దాడులు బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోని అధికమయ్యాయని అందుకే మన బీసీ ఎస్సీ ఎస్టీ రాజ్యంతోనే మనకు రక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు




మహేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు యాదగిరి , జిల్లా కార్యదర్శి ఈశ్వర్, రమేష్, ధనరాజ్, హనూక్, సంగయ్య, శ్రీనివాస్,ధర్మ సమాజ్ పార్టీ సంగారెడ్డి జిల్లా సభ్యులు గడ్డమీది విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## చందునయక్ తండాలో ఘనంగా స్వచదనం పచ్చదనం




**వాస్తవనేస్తం,బజార్హతనూర్:** మండలంలోని చందునయక్ తండాలో స్వచదనం పచ్చదనం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని విధుల గుండా ర్యాలీ తీసి పచ్చదనం పరిశుభ్రత పై ఆహ్వాన కల్పించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల పైన అప్రమత్తంగా ఉంటూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం మొక్కలు నాటి నాటిన ప్రతి మొక్కను ప్రతి ఒక్కరు రక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆవహగాన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భీమ్ సింగ్ అంగన్వాడీ కార్యకర్తలు రుక్మిణి, సింధు, ఆశ కార్యకర్తలు, నాయకులు ఫతేసింగ్, పాండురంగ వగంబరే, గ్రామంలోని మహిళా సంఘం సభ్యులు, గ్రామస్తులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## గొడవలో మాజీ సర్పంచ్, సర్పంచ్ సోదరునికి గాయాలు

- పరామర్శించిన కాట శ్రీనివాస్ గౌడ్



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** మండలంలోని రుద్రారం గ్రామంలోని పట్నం హైవే రెస్టారెంట్'కు భోజనానికి వెళ్లిన లక్డారం మాజీ సర్పంచ్ రాజిరెడ్డి సోదరులకు అక్కడి రెస్టారెంట్ నిర్వాహకులకు జరిగిన చిన్నపాటి వాగ్వాదంలో రెస్టారెంట్ నిర్వాహకులు వారిని తీవ్రంగా గాయపడేలా కొట్టారని మాజీ సర్పంచ్ రాజిరెడ్డి ఆరోపించారు. ఇట్టి విషయం తెలుసుకొని అక్కడికి వెళ్లి తగాదాను ఆపడానికి ప్రయత్నించిన తనను కూడా తీవ్రంగా గాయపడేలా కొట్టారని ఆయన ఆరోపించారు. దీంతో ఇరువురిని చికిత్స కోసం హాస్పిటల్ కు తరలించగా విషయం తెలిసిన పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ వారిని పరామర్శించారు. తక్షణమే రెస్టారెంట్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.

## బస్టాండ్'ను పరిశీలించిన డిపో మేనేజర్ దినేష్ కుమార్.



**వాస్తవ నేస్తం,బోనకల్:** మండల కేంద్రంలోని బస్టాండ్'కు కొన్ని రోజులుగా బస్సులు రాకుండా నిరుపయోగంగా ఉండటంతో సోమవారం ఖమ్మం డిపో మేనేజర్'గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన దినేష్ కుమార్, ట్రాఫిక్ సూపర్వైజర్ వెంకటేశ్వర్లు తో కలిసి బోనకల్ బస్ స్టాండ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా బస్టాండ్ అభివృద్ధి కమిటీ సభ్యులు రావుట్ల సత్యనారాయణ, పల్లబోతుల గోపి, షేక్ వజీర్,బీరువాల కృష్ణ, దేగల వేలాద్రి పులఖండం శ్రీను, స్థానికులతో కలిసి డిఎంకు బస్టాండ్ కు బస్సులు రాకపోవడం వల్ల ప్రజలు ఎదుర్కొనే సమస్యలను వివరించారు. స్థానికంగా నివసిస్తున్న సుమారు రెండు వేల జనాభాతో పాటు, ఇటువైపు ఉన్న గ్రామాల ప్రజలు ఖమ్మం వెళ్ళుటకు రైల్వే ట్రాక్ దాటి వెళ్లవలసి వస్తుందని మరియు జగ్గయ్యపేట, వైరా, మధిర, లాంటి ప్రాంతాలకు వెళ్ళుటకు పలు ఇబ్బందులు పడుతున్నామని, బస్టాండ్కు తిరిగి బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన డిఎం ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లి త్వరలోనే బస్సులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

## బ్యాంకు ముందు రైతుల ఆందోళన




**వాస్తవ నేస్తం,కోటగిరి:** తమకు రుణమాఫీ కాలేదంటూ కెనరా బ్యాంక్ ముందు రైతులు ఆందోళన చేపట్టిన ఘటన నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం కల్లూరు గ్రామంలో చోటుచేసుకుంది. తమ గ్రామంలో కొందరికి మాత్రమే రుణమాఫీ వచ్చిందని తమకు రాలేదని రైతులు బ్యాంకు వద్ద ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకొని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని రైతులతో పాటు కెనరా బ్యాంకు ఉన్నతాధికారులతో చరవాణి ద్వారా మాట్లాడారు, రుణమాఫీ కానీ రైతులు దరఖాస్తు రూపంలో ఫిర్యాదు చేస్తే వ్యవసాయం శాఖ అధికారుల సమక్షంలో రుణమాఫీ కానీ రైతుల వివరాలను పై అధికారులకు పంపిస్తామని అన్నారు

## గుత్తి కోయాగుడంలో వైద్య శిబిరం



**వాస్తవ నేస్తం,పలిమెల:** మండలంలోని గుత్తి కోయగూడెంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రఘురాం మాట్లాడుతూ.. కాలానుగుణమైన వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇంటి పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎలాంటి అనారోగ్యానికి గురైన ఎడల తక్షణమే ఆ దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుత్రుల్లో పిహెచ్సి అంబటిపల్లి అదేవిధంగా సిహెచ్సి మహదేవ్ పూర్ కి వెళ్లి వైద్యం తీసుకోవాలని వైద్య పరీక్షలు కూడా చేయించుకోవాలని, కాచి చల్లార్చిన నీరు మాత్రమే తాగాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయ్ కుమార్, హెచ్ఈఓ సోనాజీ, మాసుకలి, సత్యనారాయణ, సుధాకర్, శ్రీధర్, కోఆర్డినేటర్ ప్రశాంత్, ఏఎన్ఎం పద్మ, అశా పద్మ నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ ఎంపీపీ




**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** సంగారెడ్డి జిల్లా జన్నారం మండలం వావిలాల గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని గ్రామ కార్యదర్శి గ్రామస్తులతో కలిసి మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ ప్రారంభించారు. మాజీ ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అలాగే గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించాలని గ్రామస్తులకు తెలిపారు. గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండటం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా ఆరోగ్యవంతమైన జీవితాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు అలాగే గ్రామంలో ఉన్న ప్రతి పౌరుడు ఇంటి పరిసరాలలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించడం వల్ల సకాలంలో వర్షాలు స్వచ్ఛమైన ఆరోగ్యవంతమైన ఆక్సిజన్ రావడం వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉంటుందని సూచించారు. జిన్నారం మండలంలో ప్రభుత్వ పాఠశాలలలో 6, 7 తరగతి విద్యార్థులకు మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ కృషితో ఫ్రీ బస్ పాస్ లు విద్యార్థులకు అందించడం జరిగింది. అందులో భాగంగా జిన్నారం ప్రభుత్వ పాఠశాల మరియు కిష్టయ్య పల్లి నల్తూరు వివిధ గ్రామాలలో బస్సు పాసులను విద్యార్థులకు పాఠశాలలలో అందించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సోమేష్. ఎంపీవో రాజ్ కుమార్. వావిలాల పంచాయతీ సెక్రెటరీ మాజీ వార్డు సభ్యులు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు. నాయకులు గ్రామస్తులు యువకులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగికి, ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపిన పృథ్వీరాజ్



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** పటాన్చెరువు పట్టణానికి చెందిన నర్సింగ్ ఠాకూర్'తో కలిసి భారతదేశ ఆర్మీలో మరియు భారతదేశంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నటువంటి ఎన్ ఎస్ జి కమాండోలో బాధ్యతలు నిర్వర్తించి ఇటీవల రిటైర్ అయినటువంటి నర్సింగ్ ఠాకూర్ స్నేహితుడు మున్నా కి పటాన్చెరువు పట్టణంలో ఉద్యోగ విరమణ వేడుక నిర్వహించిన వారిని కలిసి శాలువాతో సన్మానించి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపి, ఇన్ని సంవత్సరాలు దేశం కోసం దేశ బార్డర్లలో బాధ్యతలు నిర్వహించిన వీరికి ఇకపై పటాన్చెరువు పట్టణంలో సామాజిక కార్యక్రమాలలో బాధ్యతాయుత కార్యక్రమాలలో యువతకు స్ఫూర్తిని నింపే దిశగా ముందుకు సాగాలని పృథ్వీరాజ్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో పట్టణ యువ నాయకులు, స్నేహితులు ఎండీఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## రేచీని గ్రామంలో స్వచదనం-పచ్చదనం కార్యక్రమం

**వాస్తవ నేస్తం,బెల్లంపల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా షెడ్యూల్ ప్రకారం మొదటిరోజు రేచినిలో ప్రారంభిచారు. రేచిని గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి అనిల్ కుమార్ ఆధ్యర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం నుండి ప్రాథమిక ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి, మొక్కలు నటించి, విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజా ప్రతినిధులు అన్ని శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిదులు, విద్యార్థులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



## మహాత్మ జ్యోతి పులే పాఠశాలలో ఏక్ పేడ్ మా కే నామ్ సే

**వాస్తవ నేస్తం,ఇచ్చోడ:** మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతి పులే పాఠశాలలో పేడ్ మా కే నామ్ సే కార్యక్రమాన్ని సామాజిక కార్యకర్త జక్కుల వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటి రక్షించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందన్నారు మొక్కలు నాటి రక్షించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రత్న పురం నారాయణ, సిబ్బంది గణేష్ తదితరులు పాల్గొన్నారు.



Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com